## క్లుప్తంగా

### కుల నిర్మూలన పోరాట సమితి డైరీ ఆవిష్కరణ



కొవ్వూరులో డైరీని ఆవిష్కరిస్తున్న ఆర్డీవో మల్లిబాబు తదితరులు

కొవ్వూరు: కుల నిర్మూలన పోరాట సమితి (కేవీపీఎస్) డైరీని ఆర్డీవో ఎస్.మల్లిబాబు బుధవారం కొవ్వూరులో ఆవిష్కరించారు. పౌర హక్కుల దినోత్సవాన్ని ప్రతి నెలా దళిత వాడల్లో సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు కోరారు. ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ సంఘ మాజీ నాయకుడు పెనుమాక జయరాజు, దళిత సంఘ నాయకుడు బొంతా శ్యామ్ రవిప్రకాష్, దళిత రక్షణ దళం నాయకుడు కొడమంచిలి రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, తాళ్లపూడి తహసీల్దార్ టి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

### వ్యాధుల బారిన శునకాలు



త్యాజంపూడిలో వైరస్ సోకిన కుక్క

దేవరపల్లి: శునకాలకు వైరస్ వ్యాపించింది. దాంతో రెండు నెలలుగా కుక్కలు అనారోగ్యంతో బాధపడుతున్నాయి. వ్యాధి సోకిన కుక్కలు రోడ్లపై సంచరిస్తుండడంతో ప్రజలు భయపడుతున్నారు. పలు గ్రామాల్లో ప్రజలు కుక్కకాటుకు గురవుతున్నారు. గ్రామాల్లో సంచరిస్తున్న చాలా కుక్కలకు తెల్లని మచ్చలు ఏర్పడి నోటి నుంచి సొంగ కక్కుతున్నాయని ప్రజలు తెలిపారు. వ్యాధి సోకిన కుక్కలు కరిస్తే మనుషులకు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. వ్యాధి సోకిన కుక్కలను అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### భవిత కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఈవో



వేగేశ్వరపురం భవిత కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న డీఈఓ అబ్రహం

తాళ్లపూడి: దివ్యాంగ చిన్నారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాలను నిర్వహిస్తోందని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) ఎస్ అబ్రహం అన్నారు. మండలంలోని వేగేశ్వరపురం జూనియర్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. భవిత కేంద్రానికి వచ్చే దివ్యాంగ చిన్నారుల సంఖ్యను పెంచాలన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. భవిత కేంద్రం నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవో వెంట ఎంఈవో కె వివేకానంద, భవిత సెంటర్ ఉపాధ్యాయరాలు బి. విశాలాక్షి, తదితరులు ఉన్నారు.

### నిద్రమాత్రలు మింగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

ఉండ్రాజవరం: మండలంలోని పాలంగి గ్రామానికి చెందిన పెనుమత్స శ్రీనివాసరాజు (48) నిద్ర మాత్రలు మింగి తణుకులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై కె.రామారావు బుధవారం తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. భార్య పెనుమత్స ప్రవంతి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఆపన్నుల సేవలో.. మేము సైతం..

- ఆపదలో ఉన్న వారికి అండగా టీమ్ హెల్పింగ్ హ్యాండ్స్
- దూబచర్ల కేంద్రంగా మిత్రుల సేవలు





రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన టీం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు





టీం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ లోగో

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల గ్రామానికి చెందిన పురెళ్ల సత్యనారాయణ ఇంజినీరింగ్ పూర్తిచేసి ఒక ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. యడవల్లి తిరుపతి బి ఫార్మసీ చదివి ప్రస్తుతం దూబచర్లలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. లక్కోజు లక్ష్మణ్ డిగ్రీ పూర్తిచేసి ఊళ్లోనే కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. ఇలా ఒకే గ్రామానికి చెందిన కొందరు స్నేహితులు ఒక సంఘంగా ఏర్పడి సొంత లాభం కొంతమానుకొని తమ ఊరికి ఏదైనా మంచి చేయాలనే లక్ష్యంతో 2020 జూలైలో టీమ్ హెల్పింగ్ హ్యాండ్స్ అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించారు. తొలుత ఆరుగురితో ఏర్పడి ఈ సంస్థ సభ్యుల సంఖ్య ఇప్పుడు 24కు పెరిగింది. వీరందరూ తాము సంపాదించిన మొత్తంలో కొంత కుటుంబ ఖర్చులకు, మిగతాది ఈ సంస్థ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు. బంధువులు, మిత్రులు, గ్రామస్తులు, పరిచయమైన స్నేహితుల నుంచి మరి కొంత కొంత మొత్తాన్ని సేకరిస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి పెద్దల చేతుల మీదుగా ఈ నగదు అందజేసి అండగా నిలుస్తున్నారు.

**రక్తదానంతో ఆదర్శంగా..**

రక్తదానం ప్రాణదానంతో సమానమని నమ్మిన టీమ్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఆ దిశగా అడుగులు వేశారు. రోగికి ప్రాణాపాయ సమయంలో రక్తం లభించక నానా ఇబ్బందులు పడుతున్న బంధువులను చూసి ఆ సంస్థ సభ్యులు తాము చేయవలసింది ఆర్థిక సాయం ఒక్కటే కాదని తెలుసుకున్నారు. రక్తదానం దిశగా తమ సేవా మార్గాన్ని విస్తరిస్తున్నారు. గ్రామాల వారీగా శిబిరాలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లో రక్తదానం చేయడానికి ఆసక్తి కనబరిచే వారి వివరాలు సేకరించారు. అలాంటి వారి బ్లడ్ గ్రూపుల నిర్ధారణ కార్యక్రమం చేపట్టి దాదాపు 1200 మంది బ్లడ్ గ్రూపులను సేకరించారు. ప్రతి గ్రామంలో ఒక సభ్యుడ్ని ఎంపిక చేసి ఎవరికైనా రక్తం అత్యవసరమైతే ఆ బ్లడ్ గ్రూపు వారిని తీసుకొని ఆ ఆసుపత్రికి వెళ్ళి నేరుగా రక్తం అందించేలా ఏర్పాటు చేశారు.అంతేకాకుండా అభాగ్యులు, వృద్ధులు, నిరుపేదలకు ఈ బృందం అండగా నిలుస్తోంది. కరోనా కష్ట కాలంలో ఎంతోమందికి ఆహారపొట్లాలు అందించారు. ఈ కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రధాన వీధులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నారు.

**సాటి మనిషిని కాపాడాలనే..**



ఆపద వేళలో అవసరమైన రక్తం లభించక ఇబ్బందులు పడుతున్న వారి బాధ వర్ణనాతీతం. సంపన్నులు ఏదో విధంగా కొనుగోలు చేసుకోగలుగుతారు. మరి పేదల పరిస్థితి. అలాంటి వారి కష్టాలు తీర్చడంలో కొంత మేరకైనా సహాయపడితే మేం అనుకున్న లక్ష్యం సాధించినట్టుగానే భావిస్తున్నాం. – పురెళ్ల సత్యనారాయణ, అధ్యక్షులు, టీమ్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ

**గురువుల మాటలే స్ఫూర్తిగా..**



పాఠశాల్లో చదువుకునే రోజుల్లో సాటి వారికి సాయపడమని గురువులు చెప్పేవారు. దానినే స్ఫూర్తిగా తీసుకొని టీమ్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థను ప్రారంభించాం. మండలంలోని అన్ని గ్రామాల్లోను శిబిరాలు నిర్వహించి దాతల బ్లడ్ గ్రూపులు సేకరించాం. సమీప పట్టణాల ఆసుపత్రుల నుంచి పలానా రోగికి ఫలానా గ్రూపు బ్లడ్ అవసరమని కోరగానే ఆ గ్రూపు బ్లడ్ ఉన్న వారు ఎక్కడ ఉన్నా వారిని కాంటాక్ట్ చేసి సకాలంలో ఆ రోగికి నేరుగా రక్తం అందే ఏర్పాటు చేస్తున్నాం. – యడవల్లి తిరుపతి, కార్యదర్శి, టీమ్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ

**స్ఫూర్తి నింపుతోంది**



ప్రమాదాల్లో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం దానం చేయడానికి విద్యార్థులు సైతం ముందుకు వస్తున్నారు. ఇది మాకెంతో స్ఫూర్తిదాయకం. 18 సంవత్సరాల పైబడిన కళాశాల విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కలిగిస్తున్నాం. ఆరోగ్యంగా ఉన్నవారు ఒక్కసారైనా రక్తదానం చేయాలని కోరుతున్నాను. – లక్కోజు లక్ష్మణ్, కోశాధికారి,టీమ్ హెల్పింగ్ హ్యాండ్స్

### సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్ పర్సన్ శ్రీలేఖ తదితరులు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఆ పంచాయతీ సర్పంచ్ ఎలిపే సుధారాణి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోశిన శ్రీలేఖ మాట్లాడుతూ రూ.60 లక్షల జెడ్పీ నిధులతో ఈ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పోశిన శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీటీసీ సభ్యురాలు ఊటాల స్వరాజ్యలక్ష్మి, నాయకులు ఈశ్వరరావు, నూతంగి సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు నల్లజర్లలో గడప గడపకూ..

దేవరపల్లి: నల్లజర్ల గ్రామ సచివాలయం-1 పరిధిలో గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి 183వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ నల్లజర్ల మండల శాఖ అధ్యక్షుడు గగ్గర శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గోవాలని ఆయన కోరారు.

## తలారిని కలసిన పాలకమండలి సభ్యులు



ఎమ్మెల్యే తలారి వెంకట్రావును సన్మానిస్తున్న చినవెంకన్న దేవస్థానం పాలకమండలి సభ్యులు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గ పరిధిలోని ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నియమితులైన వారిని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అభినందించారు. బుధవారం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావును ట్రస్ట్ బోర్డు సభ్యులు తానింకి గంగరాజు, సాపాయం మంగతయారు, పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావును వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు షేక్ ఖాదర్ వల్లీ, కరిచర్లగూడెం పంచాయతీ సర్పంచ్ అన్సర్ బాషా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

**నేడు ద్వారకాతిరుమలలో ప్రమాణ స్వీకారం**

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ నూతన పాలక వర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొండపైన మాధవ కల్యాణ మండపంలో గురువారం ఉదయం 10 గంటలకు ఈ వేడుక జరగనుంది. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో పాటు మరి కొందరు ప్రముఖులు పాల్గొంటారని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ప్రమాణ స్వీకారానికి అవసరమయ్యే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు ఆయన చెప్పారు.

## కోళ్లఫారం దగ్ధం



అగ్ని ప్రమాదంలో చనిపోయిన కోళ్లు

కొవ్వూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగసిపడి వేములూరు గ్రామంలో బుధవారం తెల్లవారు జామున మురమళ్ల వరదరాజుకు చెందిన కోళ్ల ఫారం దగ్ధమైంది. సుమారు 1,300 కోళ్లు మంటల్లో మృత్యువాత పడ్డాయి. కొవ్వూరు అగ్నిమాపక శాఖ సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పివేశారు. ఈ ఫారంలో 2,500 బ్రాయిలర్ కోళ్లు పెంచుతున్నామని, ఇప్పటికే సుమారు రూ.నాలుగు లక్షల వరకూ పెట్టుబడి పెట్టానని ఫౌల్ట్రీ రైతు వరదరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మరో వారం రోజుల్లో కోళ్లను విక్రయించే అవకాశం ఉందన్నారు. ఈ తరుణంలో ఈ ప్రమాదం సంభవించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంటలు ఎగసి పడుతున్న సమయంలో మెష్‌ను తొలగించి సుమారు 1,200 కోళ్లను కాపాడగలిగామన్నారు. అవి తీవ్రంగా గాయపడడం వల్ల బతికే అవకాశాలు తక్కువేనన్నారు. సకాలంలో గుర్తించడం వల్ల నష్ట తీవ్రతను కొంత మేర తగ్గించుకోగలిగానన్నారు. సుమారు రూ.3 లక్షల మేర ఆస్తినష్టం సంభవించినట్లు అగ్నిమాపక అధికారి కె.రాముడు తెలిపారు.

### హైస్కూల్‌కు గంట, మైక్ అందజేత



గంట, మైక్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు గంట, మైక్ అందజేశారు. ఈ పాఠశాల 1992-93 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు బుధవారం ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ నాగేంద్ర బాబును కలసి వాటిని అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తిగిరిపల్లి గోపి, యు.వెంకటరావు, కొడవటి గనికమ్మ, ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కాలిన గాయాలతో మహిళ మృతి

ద్వారకాతిరుమల: కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. వివరాల ప్రకారం. ఈడే దుర్గ (37), అంజయ్య దంపతులు స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా మొబైల్ క్యాంటీన్ నడుపుకుంటూ జీవిస్తున్నారు. శివాలయానికి వెళ్లే ఘాట్ రోడ్డులోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. గత నెల 31న ఉదయం వీరు ఇంటి వద్ద గ్యాస్ పొయ్యిపై నీళ్లు కాస్తుండగా, ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు ఎగసి పడ్డాయి. ఈ ప్రమాదంలో దుర్గ, అంజయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 లో తొలుత ఏలూరు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దుర్గ మృతి చెందింది. మృతురాలి సోదరుడు ముక్కు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

## దమ్మెన్ను, సూర్యారావుపాలెంలో భూముల రీ సర్వే



దమ్మెన్నులో రీసర్వే సన్నాహాల్లో అధికారులు

ఉండ్రాజవరం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ సర్వేతో రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎస్.జయలక్ష్మి అన్నారు. మండలంలోని దమ్మెన్ను, సూర్యారావుపాలెం గ్రామాల్లో బుధవారం రీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల రీ సర్వేతో కచ్చితమైన హద్దులు వస్తాయన్నారు. దీనివలన భవిష్యత్తులో ఎలాంటి సరిహద్దు తగాదాలు ఉండబోవన్నారు. సర్వే అధికారులకు రైతులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు గుర్లజర్ల సత్యనారాయణ, మెండే లలితకుమారి, ఎంపీటీసీ సభ్యులు జి.రామకృష్ణ, పెదపోలు వెంకటలక్ష్మి, వీఆర్వో శ్రీనివాసు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

## భక్తులకు మెరుగైన ఏర్పాట్లు చేయండి

- మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి
- మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి

కొవ్వూరు: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మహాశివరాత్రి నాడు గోదావరి పుణ్య స్నానాలకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి కోరారు. ఈ నెల 18న గోష్పాద క్షేత్రంలో నిర్వహించే మహాశివరాత్రి ఏర్పాట్లపై బుధవారం రాత్రి స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సమీక్ష జరిగింది. సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్నానఘట్టాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా బ్యారికేట్లు ఏర్పాటు చేయాలని ఆర్డీవో ఎస్.మల్లిబాబుకు సూచించారు. బందోబస్తుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. గోష్పాద క్షేత్రంలో ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేసి అవసరమైన మందులు, వైద్యులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. స్నాన ఘట్టాల్లో పేరుకుపోయిన ఇసుక మేటలను తొలగించాలన్నారు. నదిలో స్నానాలు ఆచరించే సమయంలో భక్తులు ప్రమాదాల బారిన పడకుండా మెష్, రక్షణ వలయంగా పడవలను గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని మత్స్య, ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించారు. స్నానఘట్టాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడం, తాగునీటి సదుపాయం, క్షేత్రంలో లైటింగ్ వంటి ఏర్పాట్లు చేయించాలని పురపాలక సంఘ కమిషనర్ బి.శ్రీకాంత్‌ను ఆదేశించారు. మహిళలు దుస్తులు మార్చుకునే గదులను సిద్ధం చేయాలని సూచించారు. తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, విద్యుత్ శాఖ ఈఈ పి.అచ్యుతాచారి, మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, ఏజీఆర్‌బీ ఏఈ ఆర్.సునీల్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇకపై భారత్ రసాయన ఎరువులు

- ఎరువుల సంచులపైనా ముద్రణ
- కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకే ఇలా..





నల్లజర్ల ఎరువుల డిపోలో భారత్ పేరుతో ఎరువుల కంపెనీ సరఫరా చేసిన యూరియా బస్తా

నల్లజర్ల: వివిధ పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం బాగా పెరిగింది. ఈ క్రమంలో రసాయన ఎరువుల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం రాయితీలు కూడా ఇస్తోంది. ఒకపక్క ప్రభుత్వం రాయితీలు ఇస్తుంటే, ఎరువుల కంపెనీలు తమ సంస్థ పేరుతో వాటిని విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నాయనే విమర్శలు లేకపోలేదు. ఇలాంటి ఆరోపణలకు అడ్డుకట్ట వేస్తూ మన దేశంలో తయారయ్యే అన్ని ఎరువులూ భారత్ పేరుతో ఉండాలని ప్రధాని నరేంద్రమోదీ గతేడాది అక్టోబరు 2న ఓ కొత్త విధానాన్ని ప్రారంభించారు. ఖరీఫ్ సీజన్ కోసం అప్పటికే మార్కెట్‌లోకి పుష్కలంగా ఎరువులను సరఫరా చేశారు. ఇపుడు కొత్తగా రబీకి అవసరమైన ఎరువులను ఆయా ఎరువుల కంపెనీలు భారత్ పేరుతో ముద్రించి సరఫరా చేస్తున్నాయి. భారతీయ జన్ ఊర్వరక్ పరియోజన పేరుతో పెద్ద అక్షరాలతో ఎరువుల సంచులపై ముద్రించారు. అలాగే బస్తా కింద చిన్న అక్షరాలతో ఆయా ఎరువులను తయారు చేసే కంపెనీ పేరు ఉంటుంది. అన్ని పంటలకు ఉపయోగించే యూరియాతో పాటు భారత్ డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ తదితర ఎరువులు ఇపుడు బహిరంగ మార్కెట్లోకి వచ్చాయి.

ఎరువుల తయారీకి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తోంది. అయితే కొన్ని ఎరువుల కంపెనీలు తమ సంస్థ గురించి గొప్పగా ప్రచారం చేసుకుంటూ విక్రయాలు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఒక్కోసారి ప్రధాన వినియోగదారులైన రైతులపై అధిక భారం మోపుతున్నాయి. దీనికి అడ్డుకట్టవేసే విధంగా దేశమంతా ఒకే పేరుతో ఎరువులు అమ్మాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. రూ.లక్షల కోట్ల మేర ప్రభుత్వం రాయితీలు ఇస్తుంటే ఆయా కంపెనీలు తమపేరు మీద అమ్మకాలు చేపట్టడం సమంజసం కాదని ఈ విధానం తీసుకొచ్చినట్టు చెబుతున్నారు. ఎరువుల బస్తాలపై ప్రభుత్వం ఇచ్చే రాయితీని సైతం ముద్రిస్తున్నారు.

## పొలాల్లో ఎలుకల సామూహిక నివారణ చేపట్టాలి

నల్లజర్ల: మండలంలో వరి సాగు చేస్తున్న రైతులు అన్ని గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ సూచించారు. రైతులందరూ గురువారం తమ పొలాల్లోని ఎలుకల బొరియలు అన్నింటినీ మూసివేయాలన్నారు. శుక్రవారం ఎన్ని బొరియలు తెరవ బడ్డాయో గమనించి అక్కడ రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే మందును రైతులంతా సామూహికంగా ఒకే సారి వినియోగించి ఎలుకలను నిర్మూలించాలని సూచించారు.

### ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు అభినందనలు

నల్లజర్ల: నల్లజర్ల తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) చేపట్టిన డిప్యూటీ తహసీల్దార్ వర్ధనపు కిశోర్‌కుమార్‌ను మండలంలోని వీఆర్వోలందరూ బుధవారం కలసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. వీఆర్వోల సంఘాధ్యక్షులు పీవీఎస్ రామరాజు, ఆర్‌ఐ సూర్యారావు, సూరిబాబు, లక్ష్మణమూర్తి, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



## వార్షిక వెరిఫికేషన్ సర్టిఫికెట్ గడువు పెంచాలి



సీనియర్ పెన్షనర్ సూర్యనారాయణమూర్తిని సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

దేవరపల్లి: పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ బకాయిలు చెల్లించాలని మండలంలోని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మండల రిటైర్డ్ ఉద్యోగల అసోసియేషన్ భవనంలో బుధవారం అసోసియేషన్ అధ్యక్షుడు పప్పు వెంకట రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతి నెలా 1న పెన్షన ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. 2018 జూలై ఒకటి తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు. వార్షిక వెరిఫికేషన్ సర్టిఫికెట్ గడువును మార్చి నెలాఖరు వరకూ పెంచాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీనియర్ పెన్షనర్ వెంచర్ల సూర్యనారాయణమూర్తి 86వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి, ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కె. సీతారామయ్య, అసోసియేట్ అధ్యక్షుడు సయ్యద్ ఆలీ, ఉపాధ్యక్షుడు తలారి ఏసుదాసు, సహాయ కార్యదర్శి ఇ.నాగేశ్వరరావు, సుగుణలత తదితరులు పాల్గొన్నారు.

## మచ్చలేని నేత వట్టి వసంత్ కమార్

నల్లజర్ల: మచ్చలేని రాజకీయ నాయకుడిగా అందరి హృదయాల్లో మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ నిలిచిపోతారని మాజీ ఎంపీపీ చేబ్రోలు చినవెంకటేశ్వరరావు (కొండ)అన్నారు. వట్టి వసంతకుమార్ దశ దిన కార్యక్రమానికి వెళ్తూ బుధవారం ఉదయం దూబచర్లలోని వైఎస్సార్ వసంత్‌నగర్ కాలనీ వద్ద వసంత్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు బళ్ళ ప్రభాకరావు (నాని)మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో దూబచర్లలో ఒకేచోట 700 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడమే గాకుండా, వారందరికీ పక్కా ఇళ్లు కట్టించిన ఘనత వసంత్‌కుమార్‌కే దక్కుతుందన్నారు. వివిధ వాహనాల్లో ర్యాలీగా వారంతా వసంత్‌కుమార్ స్వగ్రామం పల్లపూరు బయలుదేరి వెళ్ళారు. కార్యక్రమంలో నాయుడు వాసు, ర్యాలి వెంకటస్వామి, మీసాల అప్పలస్వామి, చేబ్రోలు మోహనరావు పాల్గొన్నారు.

### గారపాటికి పలువురి పరామర్శ

కొవ్వూరు: పశివేదలకు చెందిన టీడీపీ నాయకుడు గారపాటి శ్రీనివాసరావును పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. ఇటీవల శ్రీనివాసరావు తండ్రి రామచంద్రరావు మృతి చెందారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, కొవ్వూరు, చాగల్లు ఎంపీపీలు కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) మట్టా వీరస్వామి, ఏఎంసీ మాజీ చైర్మన్ వేగి చిన్నా, కాపవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, గారపాటి శ్రీనివాస్, కలగర గణేష్, బండి అశోక్, పరిమి సోమరాజు పరామర్శించిన వారిలో ఉన్నారు.